క్లుప్తంగా...

ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా రూ.15, నల్లవంకాయ 23, పొడుగు వంకాయ 23, బెండకాయ 32, పచ్చిమిర్చి 40, బజ్జీమిర్చి 55, క్యాప్సికమ్ 55, పచ్చకాకర 45, పందిరి బీర 35, క్యాబేజీ 15, క్యారెట్ 40, దొండ 23, గుండుబీన్స్ 70, గింజ చిక్కుడు 65, గోకరకాయ 37, కీర 19, దోసకాయ 13, బీట్‌రూట్ 33, ఉల్లిగడ్డ 12, ఆలుగడ్డ 20, చామగడ్డ 35, మొరంగడ్డ 18, కందగడ్డ 51, సొరకాయ 11, పొట్లకాయ 15, అరటికాయ 10, మునగకాయ 3–4, ముల్లంగి 4–6. ఈ ధరలు బుధవారం ఉదయం 9 గంటల వరకు అమలులో ఉంటాయి.

జబర్దస్త్ ఫేం గెటప్ శ్రీను సందడి



వెబ్‌పోర్టల్‌ను విడుదల చేస్తున్న గెటప్ శ్రీను

సనత్‌నగర్: అమీర్‌పేటలోని మ్యారీగోల్డ్ హోటల్‌లో బుక్ ది పార్టీ మొబైల్ యాప్ ఆవిష్కరణ, ఆన్‌లైన్ వెబ్ పోర్టల్ విజయోత్సవ వేడుకలో జబర్దస్త్ ఫేం గెటప్ శ్రీను, వర్ధమాన నటి కామాక్షి భాస్కరాల, గాయకులు కృష్ణ చైతన్యతో కలిసి మొబైల్ యాప్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీను మాట్లాడుతూ.. పెళ్లిళ్లు, ఇతర శుభకార్యాలు, పార్టీలు, ఈవెంట్లను నిర్వహించడం ఈ రోజుల్లో కష్టమైన పనేనని అయితే ఒకే ఒక్క వెబ్‌సైట్ ద్వారా అన్ని సౌకర్యాలు సమకూరేలా యాప్‌తో పాటు పోర్టల్‌ను రూపొందించడం ఎంతో సౌలభ్యంగా ఉంటుందన్నారు.

పేదలకు వరం సీఎంఆర్‌ఎఫ్



ఎల్‌ఓసీ పత్రాలు అందజేస్తున్న మంత్రి తలసాని

కంటోన్మెంట్: ఆర్థిక ఇబ్బందులతో అనేకమంది సరైన వైద్యం పొందలేకపోతున్నారని, అలాంటి ఎంతో మందిని ముఖ్యమంత్రి సహాయ నిధి ఓ రంగా నిలిచిందని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. మంగళవారం కంటోన్మెంట్ నియోజకవర్గ పరిధిలోని పికెట్‌కు చెందిన ఆటో డ్రైవర్ అందే రవిగౌడ్ భార్య రమ్య వెన్నెముక, నరాల సంబంధిత వ్యాధితో బాధపడుతుంది. నివారణ కోసం అత్యంత ఖరీదైన మందులు వాడాల్సి ఉందని వైద్యులు తెలిపారు. ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్న తనకు ఖరీదైన మందులు కొని వైద్యం చేయించే స్థోమత లేదని, ఆదుకోవాలని మాజీ కార్పొరేటర్ దివంగత ఎమ్మెల్యే సాయన్న కుమార్తె లాస్య నందిత సహకారంతో మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను కలిసి విన్నవించారు. మంత్రి చొరవతో మంజూరైన రూ. 2.50 లక్షల ఎల్‌ఓసీ పత్రాన్ని మంగళవారం బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు.

క్రీడల్లో రాణించేందుకు శిక్షణ శిబిరాలు దోహదం



బహుమతులు అందుకున్న వారితో శ్రీనివాస్‌గౌడ్

లాలాపేట: క్రీడల్లో రాణించేందుకు నగరంలో జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో నిర్వహించే వేసవి శిక్షణ శిబిరాలు ఎంతో దోహదపడుతాయని జీహెచ్‌ఎంసీ స్పోర్ట్స్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌గౌడ్ పేర్కొన్నారు. లాలాపేటలోని ప్రొ.జయశంకర్ స్టేడియంలో గతకొన్ని రోజుల నుంచి కొనసాగుతున్న సమ్మర్ స్పోర్ట్స్ క్యాంప్‌లో 6–16 ఏళ్ల బాల బాలికలకు షటిల్, బ్యాడ్మింటన్ విభాగంలో పోటీలు నిర్వహించారు. బాలుర విభాగంలో సోమనాథ్, రుషీల్, శివకుమార్, బాలికల విభాగంలో రిషారెడ్డి, హంసినీ, సాత్విక మొదటి మూడు స్థానాల్లో గెలుపొందారు. మంగళవారం ఏర్పాటు చేసిన బహుమతుల ప్రదానోత్సవంలో ఆయన పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు.ఈ సందర్భంగా శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.. విద్యార్థులు, యువకులు ఆసక్తి గల క్రీడలపై దృష్టి సారించి ప్రతిభ కనబర్చాలన్నారు.

సుప్రీంకోర్టు రిటైర్డ్ చీఫ్ జస్టిస్‌కు పుస్తక బహూకరణ

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్.వీ.రమణకు ''ది పాత్‌టు హ్యూమానిటీ'' పుస్తకాన్ని బహూకరించినట్లు చేనేత వర్గాల చైతన్య వేదిక జాతీయ అధ్యక్షులు డాక్టర్ చిక్కా దేవదాసులు అన్నారు. ఆయన ఇటీవల నగరానికి వచ్చిన సందర్భంగా పుస్తకాన్ని బహూకరించినట్లు మంగళవారం బాగ్‌లింగంపల్లిలో ఏర్పాటు చేసిన సమావేశంలో వివరించారు. చేనేత వర్గాల సమస్యలను కూడా మాజీ చీఫ్ జస్టిస్ రమణ దృష్టికి తీసుకెళ్లామన్నారు.

పార్కింగ్ చేస్తారు.. పత్తా లేకుండా పోతారు!

- నెలల తరబడి రోడ్లపైనే కార్లు, ఆటోలు
- శిథిలమవుతున్న వాహనాలు
- ఫిర్యాదులు చేసినా స్పందించని ట్రాఫిక్ పోలీసులు
- రాకపోకలకు ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు





రోడ్డు పక్కనే నెలల తరబడి పార్క్ చేసి ఉన్న వాహనాలు

లాలాగూడలోని రైల్వే క్వార్టర్స్ ప్రాంతంలోని ప్రధాన రోడ్డు పక్కనే నెలల తరబడి కార్లు, ఆటోలు పార్క్‌చేసి వెళ్లి పోతుండటంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. నెలల తరబడి ఇలా పార్కింగ్ చేసి వెళ్లిపోతుండటంతో స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. రోడ్డు పక్కనే కార్లు ఎవరు పార్క్ చేసి వెళ్తున్నారో కూడా అర్థం కావడం లేదని పలువురు స్థానికులు పేర్కొంటున్నారు. ఈ కార్లను ట్రాఫిక్ పోలీసులు వెంటనే తొలగించాలని కోరుతున్నారు. –అడ్డగుట్ట

ఫిర్యాదు చేసినా స్పందన కరువు..

అడ్డగుట్ట డివిజన్‌లోని లాలాగూడ ప్రధాన రోడ్డు ఇరువైపులా కార్ల పార్కింగ్‌తో నిడిపోయింది. నెలల తరబడి రోడ్డు పక్కనే పార్క్ చేసి ఉన్న కార్లను తొలగించేందుకు ఏ ఒక్కరూ ప్రయత్నించడం లేదు. పార్కింగ్ చేసిన వాహనాల చుట్టూ చెత్త, వ్యర్థాలు పారబోస్తుండటంతో దుర్గంధంగా మారుతుందని ఆ ప్రాంతాల వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గాలి వీచినప్పుడు అక్కడున్న చెత్త, కాగితలు వాహనదారులపై వస్తున్నాయని పేర్కొంటున్నారు. చెత్తలో నుంచి వెలువడుతున్న దుర్గంధంతో స్థానికులు అనేక అవస్థలు పడుతున్నారు. రోజు వారీగా ఇక్కడ కార్లు పార్క్ చేసి తీసుకెళ్లే వారు కొందరైతే.. మరికొందరు పార్క్ చేసిన వాహనాలను నెలల తరబడి, కొన్ని వాహనాలు అయితే ఎన్నో ఏళ్లుగా ఇక్కడే ఉండగా కొన్ని శిథిలావస్థకు చేరాయి. వాహనాలు నెలల తరబడి పార్క్ చేసి ఉండడంతో పలువురు స్థానికులు ట్రాఫిక్ పోలీసులకు కూడా ఫిర్యాదు చేసినా స్పందించడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

పార్కింగ్ అడ్డాగా

లాలాగూడలోని శాంతి నగర్ వాటర్ ట్యాంక్ నుంచి బడీ మసీదు వరకు రోడ్డుకు ఇరువైపులా వాహనాలు నెలల తరబడి పార్కింగ్ చేసి ఉన్నాయి. మరికొన్ని వాహనాలైతే పూర్తిగా శిథిలమై ఉన్నాయి. మొదట్లో కార్లు రాత్రి సమయాల్లో పార్క్ చేసి ఉదయాన్నే తీసుకెళ్లేవారు. ఆ తరువాత కొన్ని కార్లు నెలల తరబడి రోడ్డు పక్కనే ఉంటున్నాయి. దీంతో వాటి అద్దాలు పగిలిపోయి, టైర్లలో గాలిపోవడంతో పాటు పూర్తిగా శిథిలమై, పనికిరాకుండా పోయిన కార్లు అన్నీ ఇక్కడే పార్క్‌చేసి ఉన్నాయి. ఇప్పటికైనా ట్రాఫిక్ పోలీసులు స్పందించి రోడ్డుపైనే నెలల తరబడి పార్కింగ్‌లో ఉన్న వాహనాలను తొలగించాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.

సంత రోజు నరకమే..

శాంతినగర్‌లోని వాటర్ ట్యాంక్ నుంచి లాలాగూడ బడీ మసీదు వరకు ప్రతీ గురువారం కూరగాయల మార్కెట్ జరుగుతుంది. ఆ సమయాల్లో రోడ్డుపై తీవ్ర ట్రాఫిక్ ఏర్పడుతుంది. సంత రోజు మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు లాలాగూడ మీదుగా వెళ్లాలంటే నరకం అనుభవించాల్సిందే. పార్క్ చేసిన వాహనాలు ఉండడం కారణంగా రోడ్డుపైన మార్కెట్ నిర్వహించాల్సి వస్తుంది. దీంతో పలు సమయాల్లో కూరగాయల కొనుగోలుదారులకు ప్రమాదవశాత్తు వాహనాలు ఢీ కొంటున్న సందర్భాలు కూడా ఉన్నాయి. అందువల్ల రోడ్డుపై పేరుకుపోయిన వాహనాలను తొలగిస్తే గురువారం మార్కెట్ సమయాల్లో అటు మార్కెట్ నిర్వాహకులకు ఇటు కొనుగోలుదారులతో పాటు ప్రయాణికులకు కూడా ఇబ్బంది లేకుండా ఉంటుంది. తొలగించిన కార్ల స్థలంలో మార్కెట్ నిర్వహించుకుంటే వాహనాల రాకపోకలకు కూడా సులువుగా ఉంటుందని స్థానిక ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

బ్రిజ్ భూషణ్‌ను అరెస్టు చేయాలి



అడ్డగుట్టలో సంతకాల సేకరణ చేపడుతున్న దృశ్యం

అడ్డగుట్ట: రెజ్లర్లపై లైంగిక దాడికి పాల్పడుతున్న బ్రిజ్ భూషణ్‌ను వెంటనే అరెస్ట్ చేయాలని ఐద్వా నగర కమిటీ కార్యదర్శి నాగలక్ష్మి డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం అడ్డగుట్టలో అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం(ఐద్వా) జోన్ కమిటీ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ నిర్వహించారు. ఈ సందర్భంగా నాగలక్ష్మి మాట్లాడుతూ.. మహిళా రెజ్లర్లను లైంగికంగా వేధిస్తున్న డబ్ల్యూఎఫ్‌ఐ అధ్యక్షుడు బ్రిజ్ భూషణ్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దేశ గౌరవాన్ని శిఖర స్థాయిలో నిలిపే రెజ్లర్లపై ఈ విధమైన చర్యలకు పాల్పడడం సిగ్గుచేటన్నారు. ఈ కార్యక్రమంలో ఐద్వా నగర కమిటీ సభ్యులు అంజమ్మ, పద్మ, స్వరూప, అలేఖ్య, సుధా, రాణి, యాకమ్మ, మదర్ బి, మాలతి, అనూష, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యం



నాలుగో వార్డులో పర్యటిస్తున్న మర్రి రాజశేఖర్ రెడ్డి

కంటోన్మెంట్: నియోజకవర్గంలో సమస్యల పరిష్కారమే తన లక్ష్యమని బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన నాలుగో వార్డు ఎరుకల బస్తీలో పర్యటించారు. నాలాకు ఇరువైపులా ఉన్న బస్తీల ప్రజలకు ఎదుర్కొంటున్న సమస్యలు అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో చేపట్టిన ఎస్‌ఎన్‌డీపీ పథకాన్ని కంటోన్మెంట్‌కు సైతం వర్తింపజేసి నాలా సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతామన్నారు. ఆయన వెంట నళిని కిరణ్, పాండు యాదవ్, వినోద్, ముప్పిడి మధుకర్, శశికపూర్, కిరణ్, శ్రీకాంత్, ప్రవీణ్ యాదవ్, గంగారాం, రవి జైన్,భాస్కర్, వినోద్, పరిమళ్ ఉన్నారు.

కాంగ్రెస్‌కు పూర్వ వైభవం ఖాయం

సికింద్రాబాద్: ఏఐసీసీ కార్యదర్శి నదీమ్ జావీద్ మంగళవారం సికింద్రాబాద్ నియోజకవర్గంలోని పలు ప్రాంతాలను టీపీసీసీ కార్యదర్శి ఆదం సంతోష్‌తో కలిసి సందర్శించారు. అనంతరం చిలకలగూడలోని దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, సంఘ్ యూనియన్ నాయకులతో సమావేశమై పలు అంశాలపై చర్చించారు. సికింద్రాబాద్‌లో కాంగ్రెస్ పార్టీకి పూర్వవైభవం రానుందని ఈ సందర్భంగా నదీమ్ జావీద్ ధీమా వ్యక్తం చేశారు.



కాంగ్రెస్ కార్యకర్తలతో సమావేశమైన నదీమ్ జావీద్

సీఎం కేసీఆర్ పిలుపు కోసం ఎదురుచూస్తున్నాం

- సాయన్న పేరు చెరిపేసే ప్రయత్నాలు బాధాకరం
- దివంగత ఎమ్మెల్యే సాయన్న సతీమణి గీత



మాట్లాడుతున్న గీత

కంటోన్మెంట్: నిత్యం వందలాది మంది సందర్శకులతో కిటకిటలాడే ఆ ఇల్లు బోసిపోయింది. అధికారంలో ఉండగా ఆ ఇంటి పెద్దాయనను కలిసేందుకు పోటీ పడే నేతల్లో చాలా మంది ముఖం చాటేస్తున్నారు. ఆయనే మా నేత అన్న వారు సైతం ఆ ఇంటికి దూరంగా ఉంటున్నారు. ఈ నేపథ్యంలో పార్టీ అధినేత సీఎం కేసీఆర్ నుంచి పిలుపు వస్తోందంటూ ఆశగా ఎదురుచూస్తున్న సాయన్న సతీమణి గీత తన మనోభావాలను సాక్షితో పంచుకున్నారు.

అంతా శూన్యంలా..

తొలినాళ్లలో ఇద్దరమూ బ్యాంకు ఉద్యోగులుగా పని చేశాం. 1994లో ఆయన ఎమ్మెల్యేగా గెలిచాక ఆయనకు తోడుగా ఉండేందుకు నేను కూడా ఉద్యోగం వదిలేసి కుటుంబ బాధ్యతలు చూసుకుంటూ ఉన్నా. నిత్యం ప్రజల మధ్యే ఉండే ఆయన 2018లో తొలిసారిగా అనారోగ్యానికి గురికావడం కలిచివేసింది. ప్రజల మధ్య ఉంటేనే తాను కుదుటపడతానని చెప్పి, రోజూ కార్యకర్తలు, స్థానికులను కలిసేవారు. దురదృష్టవశాత్తూ ఆయన మరణంతో ఒక్కసారిగా మా ఇంట్లో శూన్యం ఆవహించింది. ఇప్పుడిప్పుడే కాస్త తేరుకుంటున్నా.

సొంత పార్టీ నేతలే కుట్రకు తెర..

అవినీతి మరక అంటకుండా ప్రజల మన్ననలు పొందిన ఆయనకు ప్రతీ ఎన్నికల్లోనూ పార్టీలకతీతంగా ప్రజలు నీరాజనం పట్టేవారు. ఆయన అకాల మరణం తర్వాత ఎమ్మెల్యే సీటుపై ఆశలు పెంచుకున్న కొందరు సొంత పార్టీ నేతలే ఆయనను అవినీతిపరుడిగా చిత్రించే కుట్రకు తెర తీయడం బాధ కలిగిస్తోంది. ఈ ప్రచారం ఇలాగే సాగితే ప్రజాక్షేత్రంలోకి వెళ్లి వాస్తవాలు వివరించాల్సి వస్తుంది. ముఖ్యమంత్రి కేసీఆర్‌ను కలిసే అవకాశం దొరికితే ఇక్కడి పరిణామాలు వివరిస్తా.

లైసెన్సులు లేకుండా వాహనాలు నడపరాదు



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్సై జ్యోతి

రాంగోపాల్‌పేట్: లైసెన్సులు లేకుండా వాహనాలు నడపడం చట్టవిరుద్ధమని బేగంపేట ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ ఎస్సై జ్యోతి అన్నారు. మంగళవారం ఎంజీరోడ్డులోని పద్మసాయి ఫైనాన్స్‌లో ఉద్యోగులు, సిబ్బందికి ట్రాఫిక్ నిబంధనల గురించి వివరించడంతో పాటు లైసెన్సులు లేనివారికి ఆన్‌లైన్‌లో స్లాట్ బుక్ చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఇటీవల 2019లో మోటారు వాహన చట్టం సవరించబడటంతో జరిమానాలు కూడా పెంచబడ్డాయని కాబట్టి వాహనాలు నడిపే ప్రతి ఒక్కరు డ్రైవింగ్ లైసెన్సు కలిగి ఉండాలన్నారు. లైసెన్సు లేకుండా డ్రైవింగ్ చేస్తే ఇప్పుడు రూ.5 వేల వరకు జరిమానా విధించే అవకాశం ఉందని 2022లో నగరంలో లైసెన్సు లేకుండా వాహనాలు నడిపిన 75,348 వారిపై కేసులు బుక్ అయ్యాయని గుర్తు చేశారు. టీటీఐ అధికారి చక్రధర్, సిబ్బంది పాల్గొన్నారు.

హక్కుల సాధనకు సంఘటిత పోరాటం

లిబర్టీ: బీసీలు తమ హక్కుల సాధనకు సంఘటిత పోరాటానికి సిద్ధం కావాలని బీసీదళ్ జాతీయ అధ్యక్షుడు దండ్రు కుమారస్వామి అన్నారు. విడిపోతే పడిపోతామని, కలిసి ఉంటే హక్కులు సాధించుకుంటామని కేంద్ర ప్రభుత్వంపై మరో తిరుగుబాటుకు, పోరాటానికి సన్నద్ధం కావాలన్నారు. విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ .. పోరాటాలు, ఉద్యమాలతోనే కేంద్రప్రభుత్వం దిగివచ్చి బీసీల సమస్యలు పరిష్కరిస్తుందన్నారు. గత ప్రభుత్వాల తరహాలోనే బీజేపీ ప్రభుత్వం బీసీలపై వివక్ష చూపుతుందన్నారు. బీసీలకు కనీసం పార్లమెంట్ గేటు వద్దకు కూడా రానివ్వడంలేదన్నారు. కేంద్రంపై తీవ్ర స్థాయిలో ఒత్తిడి తెస్తేనే జనగణన సాధ్యమన్నారు. చట్టసభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్ల సాధనకు పోరాడాలన్నారు.

ఏకరూప దుస్తుల కుట్టు కూలీ పెంచాలి

పంజగుట్ట: ప్రభుత్వ పాఠశాలలు, గురుకుల, హాస్టళ్ల విద్యార్థులకు అందించే ఏకరూప దుస్తుల కుట్టుకూలీ పెంచాలని, మరింత గడువు ఇవ్వాలని తెలంగాణ టైలరింగ్ అసోసియేషన్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అసోసియేషన్ గౌరవాధ్యక్షులు కె.దశరథ్, అధ్యక్షులు వి.శ్రీనివాసరాజు, కార్యదర్శి వెంకటేశం మాట్లాడుతూ విద్యార్థులకు యూనిఫాం కుట్టేందుకు ప్రభుత్వం జతకు రూ.50 చొప్పున చెల్లిస్తుందని, పెరిగిన ధరల కారణంగా ఇది ఏ మాత్రం సరిపోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం జతకు రూ.150 చొప్పున చెల్లించాలని కోరారు. ఈ రంగంపై ఆధారపడి దాదాపు 4 లక్షల కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయని, ప్రభుత్వం ఆలోచించి నిర్ణయం తీసుకోవాలన్నారు. ప్రభుత్వం తమకు జనవరిలో క్లాత్ ఇవ్వాల్సి ఉండగా ఏప్రిల్ 15న అందజేసిందని జూన్ 1వ తేదీ లోగా దుస్తులు కుట్టి ఇవ్వాలని అధికారులు ఒత్తిడి చేస్తున్నారన్నారు. జూలై నెలాఖరు వరకు గడువు ఇవ్వాలని కోరారు. డీఈఓ, గత ఏడాది కుట్టిన బిల్లులు ఇంకా రాలేదని అప్పులు చేసి దుస్తులు కుడుతున్నామని ప్రభుత్వం వెంటనే బిల్లులు చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.కుట్టుకూలీ పెంచాలని కోరుతూ ఇప్పటికే మంత్రి సబితా ఇంద్రారెడ్డి, కమిషనర్ దేవసేనకు వినతిపత్రాలు అందజేసినట్లు తెలిపారు. సతీష్, సుభద్ర, లక్ష్మినారాయణ, నర్సింగరావు, వెంకట్‌రెడ్డి, స్వర్ణలత పాల్గొన్నారు.

'బీజేపీ విజయం ఖాయం'



నియామక పత్రం అందజేస్తున్న మర్రి శశిధర్‌రెడ్డి

సనత్‌నగర్: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో సనత్‌నగర్‌లో కాషాయ జెండా ఎగురవేయడం ఖాయమని బీజేపీ సీనియర్ నేత మర్రి శశిధర్‌రెడ్డి పేర్కొన్నారు. సనత్‌నగర్ నియోజకవర్గ మైనార్టీ మోర్చా ఇన్‌చార్జిగా నియమితులైన అఫ్జల్ మంగళవారం బేగంపేటలోని బీజేపీ కార్యాలయంలో మర్రి శశిధర్‌రెడ్డి చేతుల మీదుగా నియామకపత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా మర్రి మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధిని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకువెళ్లడమే కాకుండా రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలన్నారు. అవినీతి బీఆర్‌ఎస్ ప్రభుత్వం పట్ల ప్రజలు విసిగిపోయారని, రాష్ట్రంలో బీజేపీ అధికారంతోనే అభివృద్ధి వేగవంతమవుతుందన్న విశ్వాసం ప్రజల్లో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో నమస్‌జైన్, షకీల్, సమీర్, అష్రఫ్, సిద్దిఖీ, సల్మాన్, రషీద్, ఫిరోజ్, అక్బర్, హఫీజ్, రజాక్, హుస్సేన్, అఖిల్‌కుమార్ పాల్గొన్నారు.

భోలక్‌పూర్‌లో పర్యటన..

పద్మారావునగర్: బన్సీలాల్‌పేట్ డివిజన్ భోలక్‌పూర్ ప్రాంతంలో సాగుతున్న రోడ్డు పనులను మర్రి శశిధర్ రెడ్డి పరిశీలించారు. రోడ్డు పనుల పేరిట ప్రజలను ఎంత కాలం పాటు ఇబ్బందులకు గురి చేస్తారని ఆగ్రహం వ్యక్తం చేశారు. భోలక్‌పూర్ ప్రభుత్వ పాఠశాల ముందు రోడ్డును తవ్వి నెలలు గడుస్తున్నా పట్టించుకునేనాథుడే కరువయ్యారని స్థానిక ఎమ్మెల్యే ప్రజా సమస్యలను గాలికొదిలి అవకాశవాద రాజకీయాలతో కాలం గడుపుతున్నారని ఆరోపించారు. ప్రజలు పడుతున్న అవస్థలను దృష్టిలో పెట్టుకొని వెంటనే రోడ్డు పనులను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గుంటి సత్యనారాయణ, అంగముత్తు శ్రీనివాస్, రాజీవ్ దేశ్‌పాండే, చంద్రపాల్‌రెడ్డి, రఘునాథ్ గౌడ్, శ్రీనివాస్, వికాస్, సందీప్ ఆనంద్, గోపి, నరేష్, నర్సింగ్‌రావు పాల్గొన్నారు.

బీజేపీలోకి బోర్డు ఉద్యోగి పరశురాం



మాట్లాడుతున్న పరశురాం

రసూల్‌పురా: బీజేపీలో చేరి ప్రత్యక్ష రాజకీయాల్లోకి వస్తున్నానని కంటోన్మెంట్ బోర్డు మాజీ సీనియర్ అసిస్టెంట్ ఆరె. పరశురాం పేర్కొన్నారు. జ్యోతి కాలనీలోని తన కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ.. రేపు (గురువారం) మడ్‌ఫోర్ట్ హాకీ మైదానంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, రాష్ట్ర, జిల్లా కంటోన్మెంట్ నాయకుల సమక్షంలో బీజేపీలో చేరుతున్నట్లు ప్రకటించారు. 23 ఏళ్ల బోర్డు ఉద్యోగిగా కొనసాగానని ప్రజల సమస్యలు ప్రత్యక్షంగా చూసానన్నారు. ఇప్పటికి కొన్ని ప్రాంతాల్లో ఉంటున్న కుటుంబాలకు టాయిలెట్లు కూడా లేని దుస్థితి ఉందన్నారు. ప్రధాని మోదీ పథకాలను ఆకర్షితుడినై బీజేపీలో చేరుతున్న అన్నారు.

గత ఉద్యోగుల బాటలోనే....

సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఉద్యోగుల్లో ఇద్దరు అర్థాంతరంగానే ఉద్యోగాలను వదులుకుని రాజకీయాల్లోకి వచ్చారు. 1997లో దఫేదార్‌గా పనిచేస్తున్న అర్జున్ కుమార్ ఎన్నికల్లో పోటీచేసి రాజకీయ ఉద్దండుడు కనుకుల జనార్దన్‌రెడ్డిని ఓడించి బోర్డు సభ్యుడిగా గెలిచాడు. అదే విధంగా శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న ఏనుగు రవీందర్‌రెడ్డి బోర్డు ఎన్నికల సమయంలో ఉద్యోగానికి రాజీనామా చేసి ఆ ఎన్నికల్లో ఏడో వార్డు నుంచి తన సతీమణి మంజులా రెడ్డిని పోటి చేయించి గెలిపించుకున్నారు. అనంతరం రవీందర్‌రెడ్డి తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన 2009లో ఎల్లారెడ్డి నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసి గెలిచారు. తాజాగా పరశురామ్ ఉద్యోగానికి రాజీనామా చేసి రాజకీయాల్లోకి వెళ్తున్న నేపథ్యంలో బోర్డు ఉద్యోగులు రాజకీయ రంగంలో రాణించాలని ఆకాంక్షిస్తున్నారు.

క్రీడా ప్రాంగణాలు కిటకిట

- వేసవి క్రీడా శిక్షణ శిబిరాలకు స్పందన
- ఉత్సాహంగా పాల్గొంటున్న చిన్నారులు



సనత్‌నగర్: వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. గత నెల 25 నుంచి ప్రారంభమైన శిక్షణ శిబిరాలు చిన్నారుల్లో ఉత్తేజాన్ని నింపుతున్నాయి. సనత్‌నగర్‌లోని లేబర్ వెల్ఫేర్ గ్రౌండ్‌తో పాటు పలు క్రీడా మైదానాలు, అమీర్‌పేట జీహెచ్‌ఎంసీ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ల్లో కొనసాగుతున్న క్రీడా శిబిరాలకు హాజరయ్యే చిన్నారులతో కోలాహలంగా మారాయి. వేసవి సెలవుల్లో ఆటలపై పట్టు సాధించడంతో పాటు దేహదారుఢ్యం కూడా పెంపొందుతుందన్న భావనతో తల్లిదండ్రులు సైతం ప్రత్యేక శ్రద్ధ తీసుకుని తమ పిల్లలను ప్రత్యేక క్రీడా శిబిరాలకు పంపిస్తున్నారు. క్రికెట్, హ్యాండ్‌బాల్, బాస్కెట్‌బాల్, హాకీ, స్కేటింగ్, జిమ్, బ్యాడ్మింటన్, కరాటే, యోగా ఇలా పలు రకాల ఆటల్లో చిన్నారులు కసరత్తు చేస్తున్నారు. పిల్లల్లోని ఆసక్తిని గమనించి కోచ్‌లు సైతం తగిన ప్రోత్సాహాన్ని అందించి ఆటలో వారిని రాటుదేలేలా చేసేందుకు ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారు. జాతీయ స్థాయి క్రీడాకారులుగా ఎదిగిన చాలామంది మొదట తమ క్రీడా శిక్షణ నైపుణ్యానికి వేసవి శిక్షణ శిబిరాల్లోనే పునాది పడడంతో వారిని స్ఫూర్తిగా తీసుకోవాలంటూ కోచ్‌లు చిన్నారుల్లో ఉత్సాహాన్ని నింపుతున్నారు. ఏదేమైనా ఉదయం 6 గంటల నుంచే క్రీడా ప్రాంగణాలు కిటకిటలాడుతున్నారు.



బాస్కెట్‌బాల్‌లో శిక్షణ పొందుతున్న చిన్నారులు



క్రికెట్ మెళకువలు నేర్పిస్తున్న కోచ్ రాజ్‌కిరణ్